నాణ్యత నీల్







నియోజకవర్గంలోని రహదారులపై ఇటీవల చేపట్టిన ప్యాచ్ వర్కులన్నీ మళ్లీ గోతులమయమైన దృశ్యాలు



జాతీయ రహదారిలో అక్కయ్యపాలెం సమీపంలో ప్యాచ్ వర్క్ చేపట్టిన చోట మళ్లీ ఏర్పడిన గోతులు

- ప్యాచ్ వర్కుల్లోనూ తూతూమంత్రంగా పనులు
- ఇటీవల వర్షాలకు మళ్లీ గోతులమయం
- జోన్ - 3 ఇంజినీర్లపై విమర్శల వెల్లువ

సీతమ్మధార : అధికారుల పర్యవేక్షణ లోపం... కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం... ఫలితంగా ప్రజాధనం వృథా అవుతోంది. గతుకులమయమైన రోడ్లకు చేపట్టిన ప్యాచ్ వర్కుల్లోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కొద్ది రోజుల్లోనే గతుకులమయమవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా గోతులు తేలిపోయాయి. సాధారణంగా జీవీఎంసీ నిర్మించే తారు రోడ్లలో నాణ్యత అంతగా ఉండదన్నది బహిరంగ రహస్యమే. పోనీ ప్యాచ్‌వర్కుల్లో అయినా నాణ్యత ప్రమాణాలు పాటిస్తారేమోనని కాగడా పెట్టి వెతికినా మచ్చుకైనా కనిపించడం లేదు. నియోజకవర్గ పరిధిలో గల మద్దిలపాలెం, సత్యం జంక్షన్, నక్కవానిపాలెం, పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ, తదితర ప్రాంతాల్లోని రోడ్లపై చిన్నా, పెద్ద గోతులకు రెండు నెలల కిందట ప్యాచ్‌వర్కులు నిర్వహించారు. అయితే అవన్నీ మళ్లీ గోతులమయమై పాత స్థితికే చేరుకున్నాయి. ప్యాచ్‌వర్కులు మాయమై పాత గోతులు మళ్లీ దర్శనమివ్వడంతో ఆయా వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి మీద కూడా ఇదే పరిస్థితి నెలకొనడం గమనార్హం. జాతీయ రహదారిపై అక్కయ్యపాలెం, నరసింహనగర్, ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్, గురుద్వారా తదితర ప్రాంతాల్లో కూడా రెండు నెలల క్రితమే జీవీఎంసీ జోన్ - 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో ప్యాచ్‌వర్కులు చేసిన విషయం తెలిసిందే. అవన్నీ ఇటీవల వరుసగా కురుసిన వర్షాల కారణంగా గోతులమయమైపోయాయి.

గోతులతో రాకపోకలకు అవస్థలు

ఉత్తర నియోజకవర్గ పరిధిలో గోతులకు ప్యాచ్‌వర్కులు చేశారు అన్న ఆనందం ప్రజలకు ఎంతో సేపు నిలవలేదు. వట్టుమని రెండు నెలలు గడవకముందే వర్షాల రూపంలో ప్యాచ్‌వర్కులు అన్నీ మాయం కావడం గమనార్హం. ఫలితంగా వర్షాల సమయంలో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల సమయంలో గోతులు కనిపించక వాహనాలు అకస్మాత్తుగా స్కిడ్ అవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. ఈ మార్గాల్లో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారని, వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు, జోన్ - 3 అధికారులు స్పందించి మరోసారి ప్యాచ్‌వర్కులు చేపట్టాలని... అప్పుడైనా నాణ్యత ప్రమాణాలు పాటించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ లేకనే..

జీవీఎంసీ రహదారులకు ప్యాచ్‌వర్కులు చేపట్టే సమయంలో సంబంధిత ఇంజినీర్ల పర్యవేక్షణ ఏమాత్రం ఉండడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. కనీసం అసిస్టెంట్ ఇంజినీర్ స్థాయి అధికారులైనా క్షేత్రస్థాయిలో పనులు జరిగే చోటుకు రావడం లేదు. పోనీ వర్క్ ఇన్‌స్పెక్టర్లు అయినా వస్తున్నారా అంటే అదీ లేదు. కనీసం సమీపంలోని సచివాలయం ఎమినిటీస్ కార్యదర్శులు కూడా ప్యాచ్ వర్కుల వైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వార్డుల్లో పెద్దగా ఇంజినీరింగ్ పనులేవీ నిర్మాణంలో లేనేలేవు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ప్యాచ్‌వర్కులను కూడా అటు జీవీఎంసీ జోన్ - 3 ఇంజినీర్లు, ఇటు సచివాలయ సిబ్బంది పర్యవేక్షించకపోవడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

కూటమి హయాంలో గోతులు

కూటమి ప్రభుత్వ హయాంలో రోడ్లన్నీ గోతులమయంగా తయారవుతున్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చాక వేసిన ప్యాచ్‌వర్కులు ఇటీవల కురుసిన వర్షాలకు మళ్లీ గోతులమయం కావడం గమనార్హం. వారు ఎంతలా నాణ్యత ప్రమాణాలు పాటించారో ప్యాచ్ వర్కులను చూస్తే అర్థమవుతుంది.

– సత్యవతి, నక్కవానిపాలెం

గోతుల్లో వర్షపు నీరు

ఉత్తర నియోజకవర్గం పరిధిలో పలు ప్రాంతాల్లో రెండు నెలల క్రితం చేపట్టిన ప్యాచ్‌వర్కులు ఇటీవల కురిసిన వర్షాలకు మాయమైపోయాయి. ఫలితంగా వర్షాల సమయంలో రోడ్డు మీద ఉన్న గోతులు కనిపించక వాహన చోదకులు అవస్థలు పడాల్సి వస్తోంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– జి.కేశవరావు, గురుద్వార



మద్దిలపాలెం - సత్యం జంక్షన్ వద్ద ఏర్పడిన గొయ్యి



జాతీయ రహదారిపై గురుద్వారా సమీపంలో ఏర్పడిన గోతులు

ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి



రామాలయంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ, తదితరులు

మురళీనగర్: ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. మురళీనగర్‌లోని సీతా రామాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబంతో అందరూ ఆయురారోగ్యాలతో గడపాలంటే దేవుని ఆశీస్సులు అవసరమన్నారు. చుట్టూ ఉన్న పేదలకు సాయం చేయాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ రోజుకి ఏదో ఒక మంచి పని చేయాలని సూచించారు. ముందుగా అర్చకులు అయలూరి రామశాస్త్రి, ఆలయ కమిటీ సభ్యులు సీపీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని సీతారామచంద్రుడితోపాటు లలితాదేవి, ఉమారామలింగేశ్వరుడు, షిర్డీ సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టి.నారాయణ రెడ్డి, సనపల వరప్రసాద్, పెంటకోట శ్రీనివాసరావు, ఎస్ఎంకే మోహన్ ఆనంద్, సీతిన సత్యనారాయణ విజయలక్ష్మి క్ష్మి, ఇతర సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రూప్ - 2 ఫలితాలు మళ్లీ విడుదల చేయాలి

సీతమ్మధార : గ్రూప్ – 2 ఫలితాలు మళ్లీ విడుదల చేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినతిపత్రం అందించారు. మెయిన్ పరీక్షల కోసం అభ్యర్థులను మళ్లీ ఎంపిక చేయాలని కోరారు. అలాగే 2022 పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ రాత పరీక్షల్లో అనేక తప్పులు దొర్లాయని, వాటికి గ్రేస్ మార్కులు ఇచ్చి అభ్యర్థులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం యువతకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఆయనతోపాటు వాసుపల్లి రాంబాబు ఉన్నారు.

క్లుప్తంగా

ఘనంగా కార్పొరేటర్ వెంకటరమణ జన్మదిన వేడుకలు



వెంకటరమణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న రమణికుమారి, తదితరులు

మద్దిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ జన్మదిన వేడుకలు పార్టీ కార్యాలయంలో ఆర్‌వీఆర్ యువసేన ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అభిమానులు, పార్టీ నాయకులు రెయ్యి వెంకటరమణకు జన్మదిన శుభాకంక్షలు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వార్డు పరిధిలో గల కేర్ అండ్ లవ్ ఆశ్రమంలోని మానసిక వికలాంగులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు పేడాడ రమణికుమారి, స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ క్లబ్ నూతన కమిటీ



మహిళా వాకర్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు

మురళీనగర్ : మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం బుధవారం కొలువు తీరింది. ఈస్ట్ పార్కులోని అబ్దుల్ కలాం కళావేదికలో నూతన అధ్యక్షురాలు కె.మాధవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల వివరాలు ప్రకటించారు. 2025 సంవత్సరంలో నిర్వహించాల్సిన సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు కె.మాధవి, ఉపాధ్యక్షురాలు సీహెచ్.వరలక్ష్మి, కార్యదర్శి పి.కమల, సంయుక్త కార్యదర్శి ఎ.రాధ, కోశాధికారి ఎం.శేషామణి, సంయుక్త కోశాధికారి లీలానాయుడు, జాలీ వాకర్స్ ఎస్.కృష్ణవేణి, కె.సుగుణ, డైరెక్టర్లు సుశీల హిమబిందు, ఎం.మహాలక్ష్మి, జి.మహాలక్ష్మి, ఎస్.పూర్ణిమ, ఎ.మాధవీలత, లక్ష్మీకుమారి, తులసీ ప్రభ, డి.రాణీ, శోభ, సుమలత, సలహాదారులు ఎస్.లలితా రెడ్డి, డి.శిరీష పాల్గొన్నారు.

దీక్షా శిబిరం వద్దే నూతన సంవత్సర వేడుకలు



దీక్ష శిబిరం వద్ద సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 93వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో పాల్గొన్న నాయకులు నూతన సంవత్సరం సందర్భంగా దీక్ష శిబిరం వద్దే కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ టెండర్‌కు ఎవరొచ్చినా అడ్డుకుని తీరుతామని, అలా వచ్చిన వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పోర్టు హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందన్నారు. ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగితే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, శంకర్రావు, సీహెచ్ త్రినాథరావు, కేఎస్ కుమార్, శ్రీను, రాఘవులు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

17 మంది మందుబాబులపై కేసుల నమోదు

బీచ్‌రోడ్డు : నూతన సంవత్సర వేడుకలు జరుపుకుని మద్యం సేవించి వాహనం నడుపుతున్న 17 మందిపై మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 17 మందిపై కేసులు నమోదు చేసి, శబ్ద కాలుష్యానికి కారణమైన సైలెన్సర్లు కలిసిన ఐదు వాహనాలపై కేసులు నమోదు చేశారు.

నీల్ అముండ్‌సన్ విగ్రహం ఏర్పాటు



నీల్ అముండ్‌సన్ విగ్రహం ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ వీఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ఆధునిక కెమికల్ ఇంజినీరింగ్ పితామహుడు నీల్ అముండ్‌సన్ విగ్రహాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముంబయిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ పూర్వ వీసీ పద్మశ్రీ జీడీ యాదవ్ ఆన్‌లైన్‌లో, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్ సంయుక్తంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ బీవీ లక్ష్మణరావు సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ వీఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో కెమికల్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న ప్రతి ఒక్కరికీ నీల్ అముండ్‌సన్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ యు.శ్రీదేవి, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఆయిల్ టెక్నాలజీ ఇన్‌చార్జి హెడ్ డి.దామోదర్, పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ సీహెచ్ జయప్రకాషరెడ్డి, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, సీనియర్ లెక్చరర్ డాక్టర్ ఎం.విజయలక్ష్మి, జనరల్ విభాగం ఫిజిక్స్ లెక్చరర్ ఆర్.జ్యోతి పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పార్టీ నగర మాజీ అధ్యక్షుడు జీవీ రవిరాజు, ఉత్తర నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బొద్దేటి గంగామహేష్, దుప్పలపూడి శ్రీనివాస్, బాద శ్రీనివాస్

న్యూ ఇయర్ జోష్



పోర్టు స్టేడియంలో నూతన సంవత్సర వేడుకల్లో ఉత్సాహంగా వాకర్స్

సీతంపేట : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో న్యూ ఇయర్ వేడుకలు బుధవారం సందడిగా జరిగాయి. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో పత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయాలను సందర్శించడంతో కిటకిటలాడాయి. సీతంపేటలోని దుర్గా గణపతి ఆలయం, పార్వతీశ్వరాలయం, శ్రీకంఠగురుదత్త ఆలయం, అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠం, రామలింగేశ్వరాలయం వద్ద భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. ఆలయాల్లో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. దుర్గా గణపతి ఆలయంలో గణపతి హోమం, పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలను సందర్శించి అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

➡ పోర్టు స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు, కార్యదర్శి విఠల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేసి వాకర్స్ అందరికీ పంచి పెట్టారు. ఒకరికొకరు న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

➡ బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో న్యూ ఇయర్ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ కేక్ కటే చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బ్రహ్మకుమారీస్ వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, రామేశ్వరి, మహమ్మద్ మునీర్, వి.సన్యాసిరావు, సత్యమూర్తి, గౌరీ శంకర్, బాబ్జి పాల్గొన్నారు.

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా బాపూజీనగర్ రామలింగేశ్వరాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సూర్యప్రకాష్ శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. ఊర్వశికూడలి దేవేంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో శరవణ ట్రస్టు వ్యవస్థాపక ధర్మకర్త దేవాల కృష్ణంరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలయాన్ని రకరకాల పూలతో సుందరంగా అలంకరించారు. కలశ స్థాపన, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పన్నీరు, చందనాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం జాషువానగర్ ప్రసన్న వినాయక ఆలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రధాన అర్చకులు జగదీష్‌శర్మ అధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. కంచరపాలెం పరిధిలో పలు ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వృద్ధులకు అండగా ఉందాం

మురళీనగర్ : వృద్ధుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆర్‌బీఎల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రొబ్బి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టాభిరెడ్డితోటలోని ఆర్‌బీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థ వృద్ధాశ్రమంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలు పట్టించుకోకపోవడం వల్ల నిరాశ్రయులుగా మారిన ఎందరో వృద్ధులకు తాము ఆశ్రయం కల్పించి సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ పెద్దల సంరక్షణ పట్ల మానవత్వం చూపాలని కోరారు.

సినీ గీతాలతో న్యూ ఇయర్‌కు స్వాగతం

సీతంపేట : సాంస్కృతిక సంగీత సంస్థ మెలోడీ క్రియేటర్స్ అధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సినీగీతాలతో న్యూ ఇయర్‌కు ఘన స్వాగతం పలికారు. దర్శకుడు, నిర్మాత దుగ్గివలస దివాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత విభావరిని ప్రారంభించారు. గాయనీ గాయకులు ప్రముఖ చలన చిత్రాల్లోని హిట్ సాంగ్స్ ఆలపించి అలరించారు. వాయిస్ ఆఫ్ యూత్ 2024 పోటీలో విజేతలుగా నిలిచిన యువతీ యువకులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎం.వి.వి.సత్యనారాయణ, సన్ మూర్తి, అరుణ్‌కాంత్, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షుడు సి.హెచ్.వి.సత్యనారాయణ, కార్యదర్శి ఎం.వి.రాజశేఖర్, కన్వీనర్ కడలి, వి.ప్రభాకర్, ఎం.ఎస్.మాధవ్, ఎం.పుండరీకుమార్, వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మేయర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సనపల నారాయణస్వామి, జీవీ రమణ



వానప్రస్థ వృద్ధాశ్రమంలో వృద్ధుల సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న శ్రీనివాస్

శ్రీలలితాపీఠం క్యాలెండర్ ఆవిష్కరణ

సీతంపేట : అక్కయ్యపాలెంలో గల శ్రీలలితాపీఠం రూపొందించిన 2025 ఆధ్యాత్మిక క్యాలెండర్‌ను పీఠం దర్బారు హాలులో బుధవారం ఆవిష్కరించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. పీఠం మొదటి పీఠాధిపతి దక్షిణామూర్తి పరమహంస, రెండో పీఠాధిపతి అవ్యక్తనంద మహరాజ్, మూడో పీఠాధిపతి శివచిదానంద భారతీ స్వామి, ప్రస్తుత పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి, శ్రీలలితాదేవి చిత్రాలతో క్యాలెండర్ చూడముచ్చటగా రూపొందించారు. భక్తులకు ఉచితంగా క్యాలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఠం అర్చకులు పాల్గొన్నారు.



శ్రీలలితాపీఠంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేనేజర్ కృష్ణసేన్, తదితరులు

ఎమ్మెల్యే కార్యాలయంలో వేడుకలు

సీతమ్మధార : సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల బీజేపీ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకి పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జోన్ – 3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, జోన్ – 5 జోనల్ కమిషనర్ రాము, యూసీడీ విభాగం ఏపీడీ పుణ్యవతి, తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ నాయకుడు మహ్మద్‌నజీర్, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ, పలువురు సీఐలు, ఎస్ఐలు, కార్పొరేటర్లు సాడి పద్మావతి, బాణాల శ్రీనివాసరావు, శశికళ, రెయ్యి వెంకటరమణ, ఆళ్ల లీలావతి, పైలా ప్రసాద్, సీతమ్మధార తహసీల్దార్ ఎం.రమేష్, గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్.వి.రమేష్, అసిస్టెంట్ తహసీల్దార్ రవికృష్ణ, ఆర్ఐ కోమలి, డీటీ సువర్ణబాయి, ఎ.త్రినాథ్, తదితరులు ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పలువురు కార్పొరేటర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విజయనగరం మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు, జీవీఎంసీ సీసీపీ ప్రభాకర్, ఏసీపీలు మధుసూధనరావు, ఉమామహేశ్వరరావు, బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక, సునీల్‌కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పలువురు ప్రతినిధులు

దేవుని యందు భక్తితో సాగుదాం

సీతంపేట : కొత్త సంవత్సరంలో దేవుని యందు భయభక్తులతో మార్పు చెందాలని మిరకల్ చర్చి ఫాదర్ బ్రదర్ శామ్యూల్ కర్మోజి పిలుపునిచ్చారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా బుధవారం పోర్టు స్టేడియంలో వాచ్‌నైట్ సర్వీస్, నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన న్యూ ఇయర్ సందేశాన్ని ఇచ్చారు. కొత్త సంవత్సరమంతా దీవెనకరంగా ఉండాలంటే గతాన్ని మర్చిపోయి ముందుకు సాగిపోవాలని సూచించారు. ఈ సందర్భంగా సిస్టర్ శ్రేష్ఠ, సోహాస్ ఆలపించిన గీతాలు అలరించాయి.



వేడుకల్లో గీతాలు ఆలపిస్తున్న సిస్టర్ శ్రేష్ఠ, సోహాస్

'రిటైర్‌మెంట్ వయసు తగ్గింపు సరికాదు'

డాబాగార్డెన్స్: పదవీ విరమణ వయసు 62 నుంచి 60 ఏళ్లకు తగ్గించడం వల్ల కార్మికులు ఆవేదనకు గురవుతున్నారని, 62 ఏళ్ల వరకు కొనసాగించాలంటూ గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు టి. నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తగ్గింపు సర్క్యులర్ కార్మికులకు పిడుగు లాంటి వార్తని, సర్క్యులర్ చూసి కార్మికులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. అదనపు కమిషనర్ విభాగంలో 8 మంది, యూసీడీలో 18, ఐటీలో ఇద్దరు, ఆర్టికల్చర్‌లో ముగ్గురు, చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో 17 మంది, నీటి సరఫరా, యూజీడీ విభాగంలో 90 మంది, విద్యా విభాగంలో 28 మంది పదవీ విరమణ/చనిపోవడం కారణంగా ఆ ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. సిబ్బంది కొరతతో ఇప్పటికే పని భారం పెరిగిందని, దీనికి తోడు సుమారు 400 మంది వరకు కార్మికులను రిటైర్మెంట్ వార్త గందరగోళంలో పడేసిందన్నారు. ఇప్పటి వరకు 62 ఏళ్ల విధానాన్నే కొనసాగించాలని, లేనిచో రిటైర్ అయిన వారి వారసులకు, పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్/చనిపోయిన/అనారోగ్యం పాలైన వారి దరఖాస్తుల ప్రకారం రిక్రూట్‌మెంట్ చేసే వరకు కొనసాగించాలని కమిషనర్‌ను కోరారు. లేనిచో నీటి సరఫరాతో పాటు పారిశుద్ధ్య కార్మికులు, ఇతర విభాగాల కార్మికులు సమ్మెలోకి వెళ్లడం తప్ప, మరో మార్గం లేదని ఆ వినతిలో పేర్కొన్నారు.